## వాట్సాప్ లింక్‌ను ఓపెన్.. రూ.34వేలు మాయం

పోతారంలో సైబర్ మోసం

ముత్తారం, జనవరి 15: వాట్సాప్‌కు వచ్చిన లింక్ ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని ఓ వ్యవసాయ కూలి రూ.34,600 పోగొట్టుకున్న ఘటన ముత్తారం మండలం పోతారంలో బుధవారం జరిగింది. బాధితుడు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇట్టం వెంకటేశ్ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. అయితే బుధవారం తన మొబైల్‌లోని వాట్సాప్‌కు లింక్ రాగా, ఓపెన్ చేశాడు. ఆ కొద్దిసేపటికే అతడి హెడీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు నుంచి ఫ్లిప్ కార్డ్ పేమెంట్ పేరుతో మూడు సార్లు మొత్తం రూ.34,600 నగదు బదిలీ జరిగినట్లు మెస్సేజ్ రావడంతో కంగుతిన్నాడు. ముందుగా టెక్ట్స్ మెసేజ్ ద్వారా ఓటీపీ వచ్చిందని, ఆ వెంటనే వరుసగా నగదు కట్ అయ్యిందని వాపోయాడు. దీనిపై ఫ్లిప్‌కార్ట్ కస్టమర్ కేర్‌ను సంప్రదించినా, నగదు బదిలీకి తమకు ఎలాంటి సంబంధం లేదని వారు చెప్పడంతో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

# తెరపైకి కొత్తగా 40 పీఏసీఎస్‌లు!

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- కమిటీ ఆమోదం.. రిజిస్ట్రార్ వద్ద ఫైలు
- ఆర్థిక వెసులుబాటు కాక గతంలోనే 73 సంఘాల విలీనం
- కొత్త సంఘాలు ఏర్పడితే రాణిస్తాయా.. లేదా..? అన్న భిన్నాభిభిప్రాయాలు
- మరిన్ని పెంచాలంటూ రాజకీయ ఒత్తిళ్లు






**ఉమ్మడి జిల్లాలో కొత్తగా 40 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ను ఏర్పాటు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం కాగా, అందుకు సంబంధించిన కమిటీ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రిజిస్ట్రార్ వద్ద ఫైలు ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ప్రతిపాదిత సంఘాలు క్షేత్రస్థాయిలో అమల్లోకి రానున్నాయి. ఇదిలా ఉండగా మరిన్ని ప్రాథమిక సంఘాలను పెంచాలంటూ రాజకీయ పరంగా అధికారులపై ఒత్తిళ్లు వస్తున్నట్టు తెలుస్తున్నది. నిజానికి గతంలో ఏర్పాటు చేసిన సొసైటీల్లో చాలా వరకు మనుగడ లేక, ఆర్థిక లావా దేవీలు అంతంత మాత్రంగానే ఉండడంతో 73 సంఘాలను సమీప పీఏసీఎస్‌ల్లో విలీనం చేశారు. అయితే గతంలో పోలిస్తే కేడీసీసీబీ ఆర్థికంగా ముందుకెళ్తున్నది నిజమే అయినా.. మళ్లీ కొత్తగా ఏర్పాటు చేస్తే ఆయా సంఘాలు రాణిస్తాయా.. లేదా..? అన్న సందేహాలు వస్తున్నాయి. కాగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని అధికారులు కొత్తగా 40 పీఏసీఎస్‌లను ఏర్పాటు చేసేందుకు అడుగులు వేస్తున్న తీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**

కరీంనగర్, జనవరి 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు (కేడీసీసీబీ) 1921లో ఏర్పడింది. ప్రస్తుతం దీని పరిధిలో కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలతోపాటు కొంత భాగం.. జయశంకర్ భూపాల్‌పల్లి, హన్మకొండ, సిద్దిపేట జిల్లాలున్నాయి. వీటి పరిధిలో 135 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్)లు నడుస్తున్నాయి. అందులో 132 సొసైటీలు కేడీసీసీబీ పరిధిలో ఉండగా.. మూడు సొసైటీలు మాత్రం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా పరిధిలో ఉన్నాయి. ఇవే కాకుండా బీ కేటగిరి పరిధిలో 250 నేత, చేనేత సంఘాలు, మరో 150 లేబర్, ఎంప్లాయిమెంట్, కళాకారుల సహకార సంఘాలున్నాయి. ఆరంభంలో బాగానే నడిచినా ఆ తర్వాత రాజకీయ జోక్యం వల్ల కేడీసీసీబీ నష్టాలబాటలో నడిచింది. 2005-06లో పూర్తి నష్టాల్లో కూరుకుపోయింది. సుమారు ₹59 కోట్ల నష్టాల్లో ఉండడంతో ఆనాడు మూసివేత దిశగా అడుగులుపడ్డాయి. ఇక బ్యాంకు మనుగడ ప్రశ్నార్థకం అన్న అనుమానాలు వచ్చాయి. సహకార రంగంలో ఆనాడు ఉన్న లోపాలే కారణమన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమమయ్యాయి. 1921లో సభ్యులు తమ కోసం స్థాపించుకున్న సహకార కేంద్ర బ్యాంకులు ఆరంభంలో బాగానే నడిచినా.. రానురాను సహకార వ్యవస్థలో మితిమీరిన రాజకీయ జోక్యం.. సహకార మూలసూత్రాలను పక్కన పెట్టి సంఘ అధ్యక్షులు, పాలకవర్గసభ్యులు తమ స్వార్థం కోసం నిర్వీర్యం చేయడం వంటి కారణాలు డిపాజిట్‌దారుల నమ్మకాన్ని కోల్పోయేలా చేశాయి. పనిచేసే ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి ఎదురైంది. దీంతో బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం 1949 సెక్షన్ 11(1) నిబంధనలను పాటించలేదని పేర్కొంటూ బ్యాంకు మూసివేత స్థితికి చేరింది. కానీ, 2005 నుంచి మళ్లీ ఒక్కో మెట్టు అధిగమిస్తూ వచ్చింది. 2011-12 ఆర్థిక సంవత్సరం నాటికి నష్టాలను పూడ్చుకొని, 2015-16లో దేశంలోనే అత్యున్నత సహకార బ్యాంకుగా నాబార్డు లాంటి ప్రశంసలు అందుకున్నది. అక్కడి నుంచి తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నది. 2016లో అన్ని సంఘాలను కంప్యూటీకరణ చేసి ప్రైవేట్ బ్యాంకులకు ధీటుగా ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంతోపాటు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ₹7,500కోట్ల వ్యాపార లావాదేవీలకు చేరింది.

### 40 కొత్త ప్రతిపాదనలు ఇవే!

**కరీంనగర్ జిల్లా :** ప్రస్తుతం 30 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. కొత్తగా ఎనిమిది ప్రాంతాల్లో అంటే ఎలగందుల, చల్లూరు, ఇందుర్తి, గన్నేరువరం, గుండ్లపల్లి, బొమ్మకల్, రాములపల్లిలో ప్రతిపాదించారు.

**రాజన్నసిరిసిల్ల జిల్లా:** ప్రస్తుతం 24 సంఘాలున్నాయి. కొత్తగా తొమ్మిది ప్రాంతాల్లో అంటే చెక్కపల్లి తంగళ్లపల్లి, బద్దెనపల్లి, నిమ్మపల్లి, వీర్నపల్లి, పెద్దలింగాపూర్, కందికట్కూర్, రుద్రంగి, నర్సింగపూర్‌లో ప్రతిపాదించారు.

**జగిత్యాల జిల్లా:** 51 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. కొత్తగా ఐదు ప్రాంతాల్లో మోరపల్లి, జాబితాపూర్, బుగ్గారం, మద్దునూరు, ధర్మారాజుపల్లె, సతారాం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

**పెద్దపల్లి జిల్లా:** ఇప్పటికే 20 సంఘాలుండగా కొత్తగా ఏడు ప్రాంతాల్లో కొలనూర్, రత్నాపూర్, గుంజపడుగు, వెంకటాపూర్, పుట్నూర్, అంతర్గాం, దొంగతుర్తిలో ప్రతిపాదించారు.

**సిద్దిపేట, భూపాలపల్లి, హన్మకొండ :** పూర్వ కరీంనగర్ జిల్లా విభజన జరిగినప్పుడు పలు మండలాలు ఆయా జిల్లాల్లోకి వెళ్లిన విషయం తెలిసిందే. అప్పుడు ఆయా మండలాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు సైతం సదరు జిల్లాలకు వెళ్లాయి. అయితే ఆ సంఘాలన్నీ ప్రస్తుతం కేడీసీసీబీ పరిధిలోనే నడుస్తున్నాయి. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ఆయా జిల్లాల నుంచి వచ్చిన విన్నపాలు, రాజకీయ నాయకుల సూచనల మేరకు.. కొత్తగా ప్రతిపాదనలు తయారు చేశారు. సిద్దిపేట జిల్లాలో చూస్తే గతంలో పూర్వ జిల్లాకు చెందిన నాలుగు సహకార సంఘాలుండగా, ప్రస్తుతం కొత్తగా మూడు అంటే.. అక్కన్నపేట, రామవరం, వండ్లూరు బేగంపేటను ప్రతిపాదించారు. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నాలుగు ఉండగా.. కొత్తగా మరో నాలుగు అంటే ధన్వాడ, బోర్లగూడెం, కొయ్యూరు, పలిమెలను ప్రతిపాదించారు. అలాగే హన్మకొండ జిల్లాకు సంబంధించి పూర్వజిల్లాకు చెందిన రెండు సహకార సంఘాలు ఇప్పటికే ఉండగా, అక్కడ మూడు కొత్తగా శనిగరం, మల్లిపల్లి గూడెం, తిమ్మాపూర్‌ను ప్రతిపాదించారు.

### నాడు విలీనం

ఉమ్మడి జిల్లాలో గతంలో 208 వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలుండేవి. అప్పట్లో చాలా సంఘాలు నష్టాలబాట పట్టాయి. ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగానే ఉండడం, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోకపోవడం, లావాదేవీలపై పూర్తిస్థాయి పట్టు సాధించకపోవడం వంటి అనేక కారణాల్ల వల్ల నష్టాలను చవిచూశాయి. ఆ భారం మరింత పెరగకుండా ఉండాలంటే నష్టాల్లో ఉన్న సంఘాలను మూసివేయక తప్పదని అప్పట్లో విద్యానాథన్ కమిటీ పలు సిఫారసులు చేసింది. ఆ మేరకు ఆనాడు 73 సంఘాలను వాటి పరిధిలోని ఇతర సంఘాల్లో విలీనం చేశారు. దాంతో ఆనాడు సంఘాలు 208 నుంచి 135కు చేరాయి. ప్రస్తుతం కుదించిన సంఘాలే నడుస్తున్నాయి. అయితే ఇటీవలి కాలంలో అన్ని ప్రాథమిక సహకార సంఘాలు మల్టీ బిజినెస్‌లు చేస్తుండడంతో లాభాలబాటలో పయనిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం చూస్తే కూడా ప్రతి గ్రామంలో ఏదో ఒక సహకార సంఘం ఉండాలన్న నిబంధన ఉన్నది. ఈ నేపథ్యంలో కొత్తగా తెరపైకి 40 సంఘాల ప్రతిపాదనలను తయారు చేసినట్టు తెలుస్తున్నది. అయితే దీనిపై పలు రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ఇప్పటికీ కూడా కొన్ని సంఘాలు అక్కడికక్కడికే నడుస్తున్నాయి. కొత్త సంఘాలు ఏర్పడితే ఆయా సంఘాల పరిధిలో వ్యాపార విభజన జరిగే అవకాశమున్నది. ఆ ప్రభావం ఆయా సంఘాలపై పడుతుందన్న అభిప్రాయాలున్నాయి. అంతేకాదు, సంఘాలు చిన్నవి కావడం వల్ల అక్కడ నిర్వహణతోపాటు వివిధ రకాల ఖర్చుల వల్ల వ్యయభారం కూడా పెరిగే అవకాశాలున్నాయి. ఈ ప్రభావం తిరిగి కేడీసీసీబీపై కూడా చూపవచ్చన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే రైతుల సౌలభ్యం దృష్ట్యా కొత్త సంఘాలను తెరపైకి తెస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ సంఘాల మనుగడ ఎలా ఉంటుందన్నది ముందుముందు తేలనుండగా.. మరిన్ని ప్రాథమిక సహకార సంఘాలు పెంచాలని అధికారులపై పలువురు రాజకీయ నాయకులు ఒత్తిళ్లు తెస్తున్నట్టు తెలుస్తున్నది. పరిపాలన సౌలభ్యం అని చెప్పడం బాగానే ఉన్నా.. భారీగా పెరగడం వల్ల నిర్వహణ భారం పెరిగి, మళ్లీ ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు కూడా ఉంటాయి.

# అణచివేత.. నిర్బంధం

### పండుగ పూట ఉమ్మడి జిల్లాలో కొనసాగిన ఆంక్షలు

- ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నేతల అరెస్ట్‌లు
- పలువురు నాయకులు గృహనిర్బంధం
- కౌశిక్‌రెడ్డిని కలువకుండా కట్టడి
- ఠాణాల్లోనే బంధీలైన నాయకులు
- ఎట్టకేలకు కౌశిక్‌కు బెయిల్



బెయిల్ మంజూరు కావడంతో మెజిస్ట్రేట్ ఇంటి నుంచి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని బయటకు తీసుకువస్తున్న న్యాయవాదులు

**పండుగపూట ఉమ్మడి జిల్లాపై నిర్బంధం అమలైంది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల పేరిట అరెస్టులపర్వం కొనసాగింది. బీఆర్ఎస్ నాయకులను ఎక్కడికక్కడ ఠాణాల్లో బంధించడం, కొందరిని గృహనిర్బంధం చేయడం అణిచివేతకు అద్దం పట్టింది. పార్టీ ఫిరాయించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను నిలదీసిన కేసులో కౌశిక్‌రెడ్డిని రాత్రంతా త్రీటౌన్‌లోనే బంధించి ఉంచగా, ఆయన్ను కలువనీయకుండా అరెస్టులు చేయడంతో చాలా మంది పండుగపూట పోలీస్ స్టేషన్లలోనే గడపాల్సి వచ్చింది. అనేక హైడ్రామాల మధ్య సంక్రాంతి పండుగ రోజైన మంగళవారం కౌశిక్‌రెడ్డికి బెయిల్ మంజూరు కాగా, రెండు రోజుల ఉత్కంఠకు తెరపడినట్టయింది.**

కరీంనగర్, జనవరి 15(నమస్తే తెలంగాణ)/రాంనగర్: కరీంనగర్ కలెక్టరేట్‌లో ఈ నెల 12న నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తోపాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. 'బీఆర్ఎస్ బీఫాంపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరావు. ఇంతకీ నీది ఏ పార్టీ?' అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరగ్గా.. ఒక ఎమ్మెల్యే అని కూడా చూడకుండా కౌశిక్‌రెడ్డిని పోలీసులు బలవంతంగా బయటకి లాక్కెళ్లారు. అదే రోజు జగిత్యాల ఎమ్మెల్యే పీఏ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తోపాటు కరీంనగర్ ఆర్డీవో వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఫిర్యాదుపై కాకుండా మిగతా రెండు ఫిర్యాదులపై కేసులు నమోదు చేసిన పోలీసులు, సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేసి కరీంనగర్ తీసుకొచ్చారు. అంతకుముందు నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్బంధ కాండను కొనసాగించారు. ముందు జాగ్రత్త చర్యల పేరిట బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లలో బంధించారు. ఇక కౌశిక్‌రెడ్డి సొంత నియోజకవర్గం హుజూరాబాద్‌లోని దాదాపు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేశారు. కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావును మానకొండూర్‌లోని తన ఇంట్లో గృహ నిర్బంధం చేశారు. జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో కూడా ఇదే విధంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. అయితే పండుగ పూట నిర్బంధించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

### రాత్రంతా ఉత్కంఠే

పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్ నేపథ్యంలో సోమవారం రాత్రి కొందరు బీఆర్ఎస్ నాయకులు కరీంనగర్ వన్‌టౌన్ ఎదుట ఆందోళనకు దిగారు. వారిని అరెస్ట్ చేసిన పోలీసులు, స్థానిక పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించి అక్కడే నిర్బంధించారు. అరెస్ట్ విషయం తెలిసి కరీంనగర్ వచ్చిన పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిని కూడా కలువనీయకుండా పోలీసులు ఆంక్షలు పెట్టారు. సంఘీభావంగా ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులను కట్టడి చేశారు. కౌశిక్‌ను మొదట పోలీసు శిక్షణ కేంద్రానికి తీసుకువచ్చిన పోలీసులు, అక్కడి నుంచి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడికి కూడా వచ్చి రాత్రంతా నిరీక్షించారు. పోలీసులు ఏ క్షణంలోనైనా మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చవచ్చనే ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అయితే మంగళవారం హాజరు పరుస్తామని పోలీసులు చెప్పినా.. కొందరు అక్కడే నిరీక్షించారు.

### బెయిల్ మంజూరుతో ఊపిరి

కౌశిక్‌రెడ్డిని మంగళవారం ఉదయం భారీ బందోబస్తు మధ్య త్రీ టౌన్ నుంచి కరీంనగర్ రెండో అదనపు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచేందుకు తీసుకెళ్లారు. మెజిస్ట్రేట్ ఎదుట రిమాండ్ షీట్ సమర్పించిన ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. కౌశిక్ రెడ్డిపై ఇది వరకే కేసులు ఉన్నాయని, ఆయనను రిమాండ్‌కు పంపించాలని కోరారు. అయితే, కౌశిక్ రెడ్డి తరఫున ప్రముఖ న్యాయవాదులు మధుసూదన్‌రావు, సర్దార్ రవీందర్ సింగ్ తమ వాదనలు వినిపించారు. అన్ని కేసులు బెయిలేబులే అయినప్పుడు రిమాండ్‌కు పంపరాదని మెజిస్ట్రేట్‌కు విజ్ఞప్తి చేశారు. మెజిస్ట్రేట్ ఇరువర్గాల వాదనలు విని బెయిల్ మంజూరు చేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకొని కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. కోర్టు ఆదేశాల మేరకు తాను రాజకీయాలు మాట్లాడడం లేదని, తనకు మద్దతుగా నిలిచిన ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవితకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తానికి కౌశిక్ రెడ్డికి బెయిల్ మంజూరు కావడంతో రెండు రోజుల ఉత్కంఠకు తెరపడింది.




హుజూరాబాద్: మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు



ఏసీబీకి పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, డాక్యుమెంట్ రైటర్ సహాయకుడు

# ఆయన రూటే సెప'రేటు'!

- మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు
- ప్రతి ఫైల్‌కు ఓ రేటు.. లంచం ఇస్తేనే పని
- దస్తావేజు లేఖరితో డబ్బుల వసూళ్లు!
- తాజాగా బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీకి చిక్కిన అధికారి

**మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ ఆసిఫొద్దీన్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఇంటిస్థలం సేల్‌డీడ్, మార్టిగేజ్ కోసం ₹5వేలు తీసుకుంటూ బుధవారం దొరికిపోయాడు. డబ్బులు తీసుకున్న కార్యాలయ అటెండర్, దస్తావేజులేఖరి సహాయకుడితోపాటు సబ్‌రిజిస్ట్రార్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేయడం కలకలం రేపింది. అయితే సబ్‌రిజిస్ట్రార్ రూట్ సెప'రేట్' అని, ప్రతి ఫైల్‌కు ఓ రేటు నిర్ణయించి చేతికి మట్టి అంటకుండా వసూలు చేస్తారనే ఆరోపణలున్నాయి.**

మెట్‌పల్లి, జనవరి15: మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ ఆసిఫొద్దీన్ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి ఆరు నెలల క్రితమే వచ్చారు. ఆయన విధుల్లో చేరినప్పటి నుంచే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఆయన నిజామాబాద్ నుంచి వచ్చి వెళ్తారని, వేళాపాలా పాటించరని, ప్రతి ఫైల్‌కు ₹ఐదు వేలకుపైగా లంచం ఇవ్వాల్సిందేనని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సేల్‌డీడ్, గిఫ్ట్‌డీడ్, మార్టిగేజ్ డీడ్, డాక్యుమెంట్ కాన్సిల్‌డీడ్, మరేదైనా కావచ్చు.. రిజిస్ట్రేషన్ చేయాలంటే ప్రతి దానికి ఓ రేటు ఉంటుందని, అడిగినంత ఇవ్వాల్సిందేనని, లేదంటే రిజిస్ట్రేషన్ కాదనే ఆరోపణలున్నాయి. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిసరాల్లో ఉన్న దస్తావేజులేఖరు(డాక్యుమెంట్ రైటర్లు)ల ద్వారా వసూళ్లకు దిగుతున్నట్టు తెలుస్తున్నది. ఇటీవల ఇబ్రహీంపట్నం మండలం డబ్బ గ్రామంలో ఆబాది స్థలాన్ని ఓ వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేసిన విషయం చర్చనీయాంశమైంది. గ్రామస్తులు అప్రమత్తమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను రద్దు చేసినట్లు తెలిసింది. ఆ సబ్ రిజిస్ట్రార్ లంచం ఇస్తే సరైన పత్రాలు లేకపోయినా రిజిస్ట్రేషన్ చేస్తారనే ప్రచారం కూడా ఉన్నది. ఈ నేపథ్యంలో బుధవారం ఓ వ్యక్తిని ఇంటి స్థలం రిజిస్ట్రేషన్, మార్టిగేజ్ కోసం లంచం డిమాండ్ చేసి అడ్డంగా దొరికిపోవడం ఆరోపణలకు బలం చేకూర్చింది. ఆ అధికారి తీరుపై మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ పరిధిలోని మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిజానికి ఎక్కడైనా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తారని, కానీ ఇక్కడ మాత్రం డాక్యుమెంట్ రైటర్లే చక్రం తిప్పుతున్నారని ఆరోపిస్తున్నారు. కొన్ని డీడ్‌ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించే స్టాంప్‌డ్యూటీ కంటే దస్తావేజులేఖరులకు, సబ్‌రిజిస్ట్రార్‌కు, కింది స్థాయి సిబ్బందికి ఇచ్చే ఖర్చులే తడిసి మోపెడవుతున్నాయని వాపోతున్నారు.

### తాగాగా ఏసీబీ వలలో..

ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌కు చెందిన బ్యాంకు ఉద్యోగి సుంకే విష్ణు మెట్‌పల్లి సాయిరాంనగర్ కాలనీలో 266 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన ఇంటి స్థలం సేల్‌డీడ్, మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ కోసం ఓ దస్తావేజులేఖరితో దస్తావేజులను (డాక్యుమెంట్) తయారు చేయించారు. గత నెల 28న ఆ దస్తావేజు లేఖరి వద్ద సహాయకుడిగా పనిచేసే ఆర్మూరు రవి సదరు దస్తావేజులను సబ్‌రిజిస్ట్రార్ మహ్మద్ ఆసిఫొద్దీన్ వద్దకు తీసుకెళ్లాడు. సేల్‌డీడ్, మార్టిగేజ్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు ₹10 వేలు ఇవ్వమని సబ్ రిజిస్ట్రార్ డిమాండ్ చేశారు. అయితే విష్ణు డబ్బులు ఇవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయకుండా పక్కన పెట్టారు. లంచం అంత ఇచ్చుకోలేనని, ₹5వేలు ఇస్తానని విష్ణు చెప్పడంతో అంగీకరించారు. కాగా, అన్ని సక్రమంగా ఉండి కూడా లంచం ఇచ్చేందుకు ఇష్టపడని విష్ణు, ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు దస్తావేజులేఖరి సహాయకుడి ద్వారా ₹5 వేలు సబ్‌రిజిస్ట్రార్ వద్దకు తీసుకెళ్లగా, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో అటెండర్‌గా పనిచేస్తున్న బానోత్ రవికుమార్‌కు ఇవ్వాలని సూచించారు. అటెండర్‌కు డబ్బులు ఇస్తుండగా, ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. వెంటనే సబ్ రిజిస్ట్రార్, అటెండర్‌తోపాటు దస్తావేజు లేఖరి సహాయకుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి చేతి వేలి ముద్రల ఆధారంగా రసాయన పరీక్షలో అవి లంచం డబ్బులేనని నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, ముగ్గురి నిందితులను కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ కరీంనగర్ డీఎస్పీ రమణామూర్తి తెలిపారు.

# ఆమ్లెట్ లేదన్నందుకు కొట్లాట!

- జమ్మికుంటలో తన్నుకున్న మందుబాబులు
- నడిరోడ్డుపై మూడు వర్గాల పరస్పరదాడులు
- రెండు గంటల పాటు హంగామా
- పోలీసుల లాఠీఛార్జీ.. 10 మందిపై కేసు



దాడులు చేసుకుంటున్న మందుబాబులు

జమ్మికుంట, జనవరి 15: జమ్మికుంటలో ఆమ్లెట్ కోసం మందుబాబులు తన్నుకున్నారు. నడిరోడ్డుపై పరస్పరం దాడులు చేసుకున్నారు. మూడు వర్గాలు రెండు గంటలపాటు హంగామా సృష్టించగా.. చివరకు పోలీసులు లాఠీఛార్జీ చేసి ఆకతాయిలను చెదరగొట్టారు. వివరాల్లోకి వెళ్తే.. జమ్మికుంట పట్టణంలోని మోత్కులగూడెం చౌరస్తా సమీపంలో ఓ బిర్యానీ, ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, ఓ వైన్ షాపు ఉంది. సోమవారం రాత్రి ఒక వ్యక్తి మద్యం తాగి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వచ్చాడు. ఆమ్లెట్ కావాలని అడిగాడు. నిర్వాహకులు లేదని చెప్పడంతో మాటల యుద్ధం మొదలైంది. బూతులు తిట్టుకున్నారు. అనంతరం దాడులు చేసుకున్నారు. మందుబాబులు తమ స్నేహితులకు సమాచారం అందించి పిలిపించారు. వచ్చిన వారంతా కొట్లాటకు దిగారు. పక్కనే ఉన్న వైన్ షాపులోని కొందరు ఘటనాస్థలానికి చేరుకున్నారు. గొడవను ఆపే ప్రయత్నం చేశారు. వారిపై కూడా దాడులు జరిగాయి. సదరు వ్యక్తులకు సంబంధించిన ఓ గ్రూపు వచ్చింది. ఒకరినొకరు కొట్టుకున్నారు. హుజూరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఇనుప రాడ్లు పట్టుకుని, బీరు సీసాలు పట్టుకుని దాడులకు తెగబడుతూ హల్‌చల్ చేశారు. రోడ్ల మీద ఎవరినీ వెళ్లకుండా అడ్డుకున్నారు. బెదిరింపులకు గురిచేశారు. ఈ ఘటనపై అందిన సమాచారంతో వెంటనే నలుగురు పోలీసులు అక్కడకు చేరుకొని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా అదుపులోకి రాకపోవడంతో అదనపు ఫోర్స్‌ను ఘటనాస్థలానికి పిలిచారు. లాఠీ ఛార్జీతో మందుబాబులను చెదరగొట్టారు. పది మందిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ రవి తెలిపారు. కాగా, నడిరోడ్డుపై రెండుగంటలపాటు సాగిన ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇక్కడే అనేకసార్లు గొడవలు జరిగాయని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.